
కథ


# చిలక ప్రశ్న

ఇమంది రామారావు



తగరపువలసలో ఓ పురాతన దేవాలయం రామాలయం! ఆ 'రామాలయం' కంటే ముందు పుట్టిన రావిచెట్టు, ఆ రావిచెట్టు చుట్టూ సిమెంటు అరుగూ, ఆ అరుగు మీద రిటైర్‌మెంటయిపోయిన ఉద్యోగులు. అక్కడున్న వారందరి దృష్టీ చిలకప్రశ్న చెప్పే రాంపండు మీదే వుంది.

రాంపండు చుట్టూ ఎప్పుడూ నలుగురయిదుగురు గుమిగూడి వుంటారు. రాంపండు చిలక జోస్యంతోబాటు 'చేతి జోస్యం' కూడా చెబుతాడు. ఒక్కోసారి రాంపండు మాట అక్షరాలా జరుగుతుందని అక్కడి వారి విశ్వాసం.



అందుకే రాంపండుకి మంచి డిమాండ్.

పండగ పబ్బాలొస్తే మరీ డిమాండ్.

అది పండుగరోజు కనుక రాంపండు చుట్టూ చిలకజోస్యం చెప్పించుకునే వారి సంఖ్య బాగా పెరిగింది. వారందరూ గుమిగూడి రాంపండు చుట్టూ కూర్చున్నారు. వాళ్లంతా చిలకజోస్యం కోసం పోటీపడుతున్నారు.

''అయ్యా!అందరికీ చెప్తాను. నిదానమే ప్రధానం'' అన్నాడు చిరునవ్వు పెదవుల మీద రంగరించుకుంటూ–

''మరి ఆలస్యం అమృతం విషం అన్నారు కదండీ!'' సింహాద్రి ధర్మ సందేహం వ్యంగ్యంగా వ్యక్తపరిచాడు అయిదురూపాయిల బిళ్ల చిలక ముందు వేస్తూ.

''అయ్యా! సామెతలు సమయానుకూలంగా మారతాయి. వాటిని మనం సీరియస్సుగా తీసుకోకూడదు. చిలక ప్రశ్నను సీరియస్సుగా తీసుకోవాలి. రాజా! చిలకరాజా! సింహాద్రి సారు చిలక ప్రశ్న కోసం తహతహలాడుతున్నారు. వారికి అదృష్టం ఎలా వుందో ఏ దేవుడు కరుణించాడో తేల్చి చెప్పు రాజా!'' ముద్దుగా గోముగా రామచిలకని పిలిచాడు.

రామచిలుక రెక్కలాడించుకొని బైటకి వచ్చింది.

ఎగాదిగా రాంపండునీ, సింహాద్రినీ చూసింది.

అక్కడ వున్న కార్డులన్నీ కలియదిప్పి అందులో ఓ కార్డు తీసి సింహాద్రి చేతిలో పెట్టింది. తిరిగి తన గూట్లోకి వయ్యారంగా వెళ్లిపోయింది.

కార్డులో వున్న బొమ్మని బైటకి తీసి చూశాడు రాంపండు.

శివపార్వతుల బొమ్మ వచ్చింది.

'అమోఘం!అద్భుతం! శివపార్వతుల బొమ్మ వచ్చింది! శివుడు భోళాశంకరుడు. పార్వతి అమ్మవారు కోర్కెలు తీర్చేతల్లి. సింహాద్రి పట్టిందలా బంగారమే అవుతుంది. అయితే ఒక చిన్న మనవి. శివుడి జడలో వున్న గంగమ్మలాగా సింహాద్రికి సెకండు సెటప్ వుంది. ఆకారణంగానే అప్పుడప్పుడు చిటపటలు సంసారంలో చోటు చేసుకుంటాయి. అయినా శుభం జరుగుతుంది!చిలక ప్రశ్నని నమ్మండి!'

రాంపండు సింహాద్రికి అభయం ఇచ్చాడు.

సింహాద్రి మీసం మెలేసాడు...సింహాద్రి ముసి ముసి నవ్వులు బుగ్గ మీసాల్లో చిక్కుకుపోయాయి. దర్పంగా వెళ్లిపోయాడు.

మరో ఆసామి అయిదు రూపాయలు ఇచ్చి ముందుకు వచ్చి కూర్చున్నాడు.

పేరు సత్తిపండు!

రాంపండు మరోసారి సత్తిపండు పేరు చెప్పి చిలకమ్మని ఆహ్వానించాడు. చిలకమ్మ ఎప్పటిలా కులుకుతూ వచ్చి ఒక కార్డు తీసి రాంపండు చేతిలో పెట్టి తన గూట్లోకి వెళ్లిపోయింది. రాంపండు కార్డులో వున్న బొమ్మ తీసి చూశాడు.

'సత్తిపండు గారికి కలకత్తా భద్రకాళి వచ్చింది.... ఆపదను సూచిస్తోంది. ప్రమాదం పొంచి వుంది జాగ్రత్త! శివుడికి రుద్రాభిషేకం చేయండి. సమస్యలు సానుకూలంగా మారతాయి!' అని చదివి వినిపించాడు. సత్తిపండు ముఖంలో జీవం లేదు.

''మండలం రోజులంటే?'' సత్తిపండు నీరసంగా అడిగాడు.

''నలభై రోజులు!'' రాంపండు జవాబు.

''సరే శివుడికి రుద్రాభిషేకం చేస్తే!...సమస్యలూ..?''

''సానుకూలమవుతాయని చిలకమ్మ చెప్పింది కదా!'' రాంపండు గాభరాగా సమాధానం చెప్పేసి ఎవరు బాబు తర్వాత? ముందు వచ్చే వాళ్లు ముందు చూపించుకోండి. వెనక వచ్చేవాళ్లు వెనక చూపించుకోండి. చిలకప్రశ్న చూపించుకోవాలనుకున్నవారు అయిదు రూపాయలు చిలకమ్మకు సమర్పించుకోండి!'' వ్యవహారాన్ని వేగవంతం చేశాడు రాంపండు.

'సన్యాసిరావు' పేరు చెప్పాడు ఒక ఆసామి.

సన్యాసి రావు పేరు చెప్పి చిలకప్రశ్న చూడమని చిలకమ్మను ఆహ్వానించాడు. అయిదు రూపాయల బిళ్ల చిలకముందుంచాడు. అది చూడగానే చిలక హంస నడకలు నడుస్తూ వచ్చింది. అటూ ఇటూ చూసింది. కాస్సేపు తటపటాయించింది. చిట్టచివరకి ఓ కార్డు తీసి రాంపండు చేతిలో పెట్టి తన గూట్లోకి వెళ్లిపోయింది.

కార్డులోంచి బొమ్మ తీసి చూసి ఆశ్చర్యపోయాడు.

''అయ్యా! సన్యాసిరావుగారూ! మీ పేరులో సన్యాసి వున్నా బొమ్మలో మాత్రం బృందావనంలో గోపాలకృష్ణుడు. సరసుడే వున్నాడు. ఆడవారి ప్రెషరు మీకు ఎక్కువగా వుంది. మీరంటే ఆడవారు పడి చస్తారు. ఈ విషయంలో మీరూ మీ శ్రీమతీ సిగపట్లు పట్టుకుంటారు. అయినా మీ మాటే నెగ్గుతుంది. మీరు భోగలాలసులు, వ్యాధిగ్రస్తులూ... మీకు ఎయిడ్స్ వచ్చే ప్రమాదం వుంది.'' అన్నాడు.

సన్యాసిరావుకి అరికాలి మంట నెత్తికెక్కింది.

''ఆ ముక్క అందులో రాసుందా?''అని అడిగాడు.

''వ్యాధిగ్రస్తుడని రాసుంది. కాలమాన పరిస్థితుల్ని బట్టి అన్వయించుకోవాలి. చిలకమ్మ మీ హితవు కోరి, ఇప్పటి నుంచే జాగ్రత్తపడమని హెచ్చరిస్తోంది!'' శృతి పెంచి అందరికీ వినిపించేలా చెప్పాడు రాంపండు.

''ఇది కాకుండా మరో మాట చెప్పండి!''

''మరో అయిదు రూపాయలు పెట్టండి!''

''ఒకసారి ఇచ్చాను కదా!''

''చిలకమ్మ ఒకసారి చెప్పింది కదా! మనుషులు నీతి తప్పుతారేమో కానీ పశుపక్ష్యాదులు నీతి తప్పవు. అయిదు రూపాయలు ఇవ్వందే మా చిలకమ్మ మళ్లీ జోస్యం చెప్పదు!'' ఖరాఖండీగా చెప్పేశాడు రాంపండు.

''అయితే ఇదిగో అయిదు రూపాయలు. మీ చిలకమ్మని పిలువు! తేడా వచ్చిందో నువ్వు వుండవు. నీ చిలకా వుండదు!'' సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చి అయిదు రూపాయలు పెట్టాడు సన్యాసిరావు.

రాంపండు చిలకమ్మని పిలుస్తూ... చిలకరాజా! మన శీలాన్నే శంకిస్తున్నాడీ సన్యాసిరావు. నిజం నిరూపించు! సన్యాసిరావుకి చిలకప్రశ్న చెప్పు!'' ప్రేమగా అభ్యర్థించాడు.


చిలకమ్మ బైటకి వచ్చి చాలా సేపు కార్డులు తిరగేసింది. సీరియస్‌గా ఆలోచించింది.మెడని అటూ ఇటూ చాపి సన్యాసిరావు మొహం చూసింది. ఒక కార్డు చటుక్కున తీసి రాంపండు ముందు గిరాటేసి గూట్లోకి వెళ్లిపోయింది సీరియస్‌గా...

ఆ కార్డులో ఏముంటుందో రాంపండు, సన్యాసిరావులతో బాటు చూసేవారందరిలోనూ ఒకటే టెన్షను. బొమ్మ బైటికి తీసి తను చూసి తృప్తిపడి... అందరికీ చూపించాడు... ఆశ్చర్యం! అదే బొమ్మ బృందావనంలో గోపాలకృష్ణుడు.

ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

''అయ్యా! సన్యాసిరావుగారూ! ఇందులో మేటరు మీకు తెలిసిందేకదా! అయినా ఒకసారి చదివి వినిపించమంటారా?'' సన్యాసిరావు కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు. సన్యాసిరావు వద్దన్నట్టుగా అడ్డంగా తలూపేడు.

ఈలోగా ఎవరో ఒక పెద్దమనిషి వచ్చాడు. చేతిలో సంచీ, సంచీలో అరటిపండ్లు వున్నాయి.



''నమస్కారం రాంపండు గారూ! మీ చిలకమ్మ చెప్పింది నిజమైంది. మా అమ్మాయికి పెళ్లి కుదిరింది. ముహుర్తాలు నిశ్చయించుకున్నాం! ఏదో ఉడతాభక్తితో మీకిది సమర్పించుకుంటున్నాం!'' భక్తితో నమస్కరించాడు.

''మా చిలకమ్మ ఎప్పుడూ శుభమే పలుకుతుంది! పెళ్లి నిర్విఘ్నంగా జరుగుతుంది వెళ్లిరండి!'' రాంపండు అభయమిచ్చాడు. ఇంతలో అప్పలకొండ వచ్చాడు. అప్పలకొండ గురించి రెండు మాటలు చెప్పాలి. ఒక్కమాటలో చెప్పాలంటే అప్పలకొండ అచ్చోసిన ఆంబోతు. అమాయకుల్ని ఆటపట్టించడమే అతగాడి పని. ఈ రోజు ఎలాగైనా రాంపండుని ఇరుకున పడేయాలని సంకల్పించుకొని మరీ వచ్చాడు.

''నాకూ చిలకప్రశ్న చెప్తావా?'' వ్యంగ్యంగా అడిగాడు.

''ఎవరికైనా చెప్తాను!''

''చిలక జోస్యం తప్పయితే నాకేమిస్తావు?''

''అయ్యా! అప్పలకొండగారూ! మా చిలకమ్మ తప్పు చెప్పదు.''

''అరువు చెప్తావా? అది నిజమైతే డబ్బులు రేపిస్తాను!''

''అరువు లేదు నాయనా! నగదు మాత్రమే పనిచేస్తుంది.''

''పోనీ...నీ దగ్గరున్న అయిదురూపాయలతో చూపించు!''

''మా చిలకమ్మ ప్రశ్న చెప్పదు.''

''అదీ చూద్దాం! నువ్వన్నట్లు చిలకమ్మ ప్రశ్న చెప్పకపోతే వంద రూపాయలు నేనిస్తాను. ఒక వేళ చిలకమ్మ ప్రశ్న చెపితే నాకేమిస్తావు?'' నిలదీశాడు అప్పలకొండ.

''చిలక ప్రశ్న చెప్పడం మానేస్తాను!''అన్నాడు రాంపండు గంభీరంగా. ఆ మాటకు అప్పలకొండతో పాటు అక్కడున్న వారందరూ అదిరిపడ్డారు.

రాంపండు తన దగ్గరున్న అయిదు రూపాయల బిళ్ల చిలకమ్మకి చూపిస్తూ... ''చిలకరాజా! ఇదిగో అయిదురూపాయలు. అప్పలకొండకి జోస్యం చెప్పు!'' వేడికోలుగా పిలిచాడు.

చిలకమ్మ ఒళ్లునెప్పులున్నట్లు భారంగా బైటకి వచ్చింది.

తోక ఒకసారి విదిలిచింది. రెక్కలు టపటలాడించింది.

కళ్లు మిటకరించింది. మెడ ఒకసారి గుండ్రంగా తిప్పి అప్పలకొండని గుర్రుగా చూసింది. తన గూటిలోకి పరుగులాంటి నడకతో వెళ్లిపోయింది. అందరూ చప్పట్లు చరిచారు. అప్పలకొండ ముఖం మాడిపోయింది.

''ఇదిగో వంద తీసుకో!'' దాదాపు రాంపండు ముఖం మీదికి నోటు విసిరినంత పనిచేశాడు అప్పలకొండ. రాంపండు గుట్టుచప్పుడు కాకుండా వంద రూపాయలు నోటు తీసి జేబులో కుక్కుకున్నాడు. అప్పలకొండ రాంపండుని ఎలాగైనా ఏడిపించాలనిపించింది. ఒక అయిదు రూపాయల బిళ్ల తీసి చిలకమ్మ ముందుంచి జోస్యం చెప్పమన్నాడు. రాంపండు చిలకమ్మని పిలిచాడు.

''రాజా! చిలకరాజా! అప్పలకొండకి జోస్యం చెప్పు!'' గోముగా పిలిచాడు. చిలకమ్మ హొయలు వొలకబోస్తూ బైటకి వచ్చింది. అందరి ముఖాల్లోకి గర్వంగా చూసింది. రాంపండు ప్రేమగా రామచిలుక తోక నిమిరాడు. రామచిలుక ఆలోచిస్తున్నట్లు తలపైకెత్తి ఒక్కో కార్డు తీసి పక్కన పడేస్తోంది. అప్పలకొండలో టెన్షన్ పెరిగిపోతోంది. చివరికి ఒక కార్డు ముక్కను కరిచి రాంపండు చేతికి అతిభద్రంగా అందించింది.

రాంపండు చిలకమ్మ ఇచ్చిన కార్డులో బొమ్మ బైటకి తీసి చూశాడు.

'మహిషాసుర మర్ధిని' బొమ్మ వచ్చింది. రాంపండు కణతలు రుద్దుకున్నాడు.

అప్పలకొండలో టెన్షన్ క్షణక్షణానికి పెరిగిపోతోంది.

రాంపండు గొంతు సవరించుకుంటూ ''అప్పలకొండకు మహిషాసుర మర్ధిని బొమ్మ వచ్చింది. ప్రమాదం పొంచి వుంది! ముందు జాగ్రత్త మంచిది. మందు మానెయ్యండి. పరస్త్రీల జోలికి పోకండి. అనవసరంగా ఎవరి జోలికి వెళ్లకండి!''అంటూ చదివి వినిపించాడు.

అప్పలకొండకి చిర్రెత్తుకొచ్చింది. ''ఇవన్నీ ఆ కార్డులో వున్నాయా?'' అంటూ కళ్లెర్ర చేశాడు. రాంపండు సహనం కోల్పోకుండా 'కార్డులో వున్నవీ... కళ్లకు కనిపించినవే చెప్తాను. మీకు జరగబోయేది చెప్పడం నా ధర్మం.''అన్నాడు.

''పెద్దాయన చెబుతుంటే వినవేం?'' ఒక పెద్ద మనిషి అప్పలకొండని మందలించాడు. అక్కడున్న వారంతా రాంపండునే సమర్ధించారు. దాంతో అప్పలకొండకి అరికాలి మంట నెత్తికెక్కింది.

''సరే... ఇంతమంది జోస్యం చూస్తున్న నీ చిలక నీకేం చెబుతుందో వినాలనుంది. చూపించూ!'' అన్నాడు చాలెంజ్ చేస్తున్నట్లు. అయిదురూపాయల బిళ్ల ఇవ్వబోతూ...

''అవసరం లేదు నాయనా! నీ సందేహాన్ని నివృత్తి చేస్తాను. నేనే డబ్బులిస్తాను. చిలకమ్మ నాక్కూడా ప్రశ్న చెబుతుంది!'' డబ్బులు వేసి చిలకమ్మని ఆహ్వానించాడు.

రామచిలుక యథాతథంగా కార్డులు వెదజల్లింది. అందులో నుంచి ఓ కార్డు తీసి రాంపండుకి అందించి ఎంచక్కా తన గూట్లోకి వెళ్లిపోయింది. రాంపండు కార్డులో నుంచి బొమ్మను బైటకి తీస్తుండగా చేతులు వొణికాయి. గొంతులో తడారిపోయింది. గుండె వేగంగా కొట్టుకోవడం మొదలయ్యింది. కార్డులోంచి బొమ్మ బైటకి తీసి చూసి చదివేడు.

'కైలాసనాథుడు కరుణించాడు. సర్వశుభాలు కలుగుతాయి!''అని చదివి అప్పలకొండ ముఖంలోకి గర్వంగా చూశాడు.

''నీకు మంచి జరుగుతుందా? చెడు జరుగుతుందా?'' నిలదీశాడు అప్పలకొండ. రాంపండు 'ముమ్మాటికీ మంచే జరుగుతుంది నాయినా'



అన్నాడు. అప్పటికే ఒళ్లంతా చెమట్లు పట్టేశాయి.

''దాహం!దాహం'' ప్రయత్నం మీద అనగలిగాడు రాంపండు. రాంపండు హటాత్తుగా అలా అయిపోవడం చూసి అక్కడి వారంతా కంగారుపడిపోయారు. నీళ్లకోసం పరుగులు తీశారు. నీళ్లు తెచ్చేలోగా అప్పలకొండ పక్కింట్లోకి వెళ్లి నీళ్లు తెచ్చిపెట్టాడు.

రాంపండు కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలాడు. అక్కడ గుమికూడిన వారందరికీ మతులు పోయాయి. ఎందుకిలా జరిగింది? ఇప్పుడే కదా చిలకమ్మ రాంపండుకి సర్వశుభాలు కలుగుతాయని చెప్పింది? అప్పలకొండకి ప్రమాదం పొంచి వుందని హెచ్చరించిన చిలకమ్మ రాంపండుని ఎందుకు హెచ్చరించలేదు? ఎందరికో మృత్యువు ముందే వుందని జోస్యం చెప్పిన రాంపండు తన మృత్యువు సంగతి ముందే ఎందుకు తెలుసుకోలేకపోయాడు? ఈ ప్రశ్నకు సమాధానం లేదనుకుందామా? శాస్త్రానికి మించిందీ మానవాతీతశక్తి ఏదో వుంది అనుకుందామా? ఏమనుకుంటేనేం? రాంపండు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. గూటిబయటే బిక్కుబిక్కుమంటూ నిలబడిపోయిన రామచిలుక స్వేచ్ఛగా బాహ్య ప్రపంచంలోకి ఎగిరిపోయింది. రాంపండు తాగే నీళ్లల్లో అప్పలకొండ విషం కలిపాడన్న విషయం అప్పలకొండ ఒక్కడికే తెలుసు.

అంతా చిలకమ్మ చెప్పిందే జరిగిందనుకుంటున్నారు.

కైలాసనాథుడు కరుణించాడనుకొన్నారు.

రాంపండు బొందితో కైలాసం వెళ్లాడనుకుంటున్నారు.

ఇంతకీ చిలకప్రశ్న నిజమా? కాదా?అన్నది ఒక ప్రశ్నగానే మిగిలిపోయింది.

★